## ఇందిరమ్మ ఇంటి కోసం ధర్నా

### అర్హుల జాబితాలో పేరు లేకపోవడంతో ఆందోళన



పందిళ్లపల్లిలో ఖమ్మం-బోనకల్లు ప్రధాన రహదారిపై బైఠాయించి ధర్నా చేస్తున్న బాధితుడు

మధిర(చింతకాని), జనవరి 25 : నిరుపేదనైన తనకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు కాలేదని నల్లగొండ ఆదినారాయణ అనే వ్యక్తి ప్ల కార్డుతో ఖమ్మం జిల్లా చింతకాని మండలం పందిళ్లపల్లి గ్రామంలోని ఖమ్మం-బోనకల్లు ప్రధాన రహదారిపై శనివారం బైఠాయించి ధర్నాకు దిగాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాపాలనలో ఇందిరమ్మ ఇంటి కోసం దరఖాస్తు చేసుకున్నప్పటికీ గ్రామసభ జాబితాలో తన పేరు లేదని ఆవేదన వ్యక్తం చేశాడు. అధికారులు చేపట్టిన ఇంటింటి సర్వేలో అనేక అవకతవకలు జరిగాయని, అర్హులైన వారికి ఇందిరమ్మ ఇల్లు, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా వంటి పథకాలు రాలేదని వాపోయాడు. అధికారులు ఇప్పటివరకు చేసిన సర్వేను రద్దు చేసి మరోసారి సర్వే చేపట్టాలని, అర్హులైన వారికి పథకాలు అందించాలని ఆయన డిమాండ్ చేశారు.

## కేసీఆర్ హయాంలోనే మధిర అభివృద్ధి

- అభివృద్ధిలో ఆదర్శంగా నిలుస్తుంది : మాజీ ఎంపీ నామా
- రాష్ట్ర రాజకీయాల్లో మధిర పాత్ర కీలకం : ఎమ్మెల్సీ తాతా మధు
- మధిర మున్సిపల్ పాలక మండలికి ఘనంగా వీడ్కోలు



వీడ్కోలు సభలో మాట్లాడుతున్న మాజీ ఎంపీ నామా నాగేశ్వరరావు, తాతా మధు



చైర్‌పర్సన్‌ను సన్మానిస్తున్న తాతా మధు, కొండబాల, నాయకులు

మధిర, జనవరి 25 : గత కేసీఆర్ ప్రభుత్వ హయాంలోనే మధిర మున్సిపాలిటీ అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందని, రూ.150 కోట్ల వ్యయంతో పలు అభివృద్ధి పనులు చేపట్టి పూర్తి చేశారని మాజీ ఎంపీ నామా నాగేశ్వరరావు పేర్కొన్నారు. మధిరలోని రిక్రియేషన్ క్లబ్‌లో మున్సిపల్ పాలక మండలి వీడ్కోలు సన్మాన కార్యక్రమం కమిషనర్ సంపత్‌కుమార్ అధ్యక్షతన శనివారం రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా నామా మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలో 100 పడకల ఆస్పత్రి, కోర్టు భవనం, , ట్యాంక్ బండ్ నిర్మాణంతోపాటు అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారని గుర్తు చేశారు. ప్రభుత్వాలు మారినా అభివృద్ధి కోసమే ప్రజాప్రతినిధులు పని చేయాలన్నారు. మధిర మున్సిపాలిటీ పాలకవర్గం చేసిన అభివృద్ధి ఆదర్శంగా నిలుస్తుందన్నారు.

### మధిర పాత్ర కీలకం : ఎమ్మెల్సీ తాతా మధు


రాష్ట్ర రాజకీయాల్లో మధిర కీలక పాత్ర పోషిస్తుందని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధు అన్నారు. రాజకీయాలకు అతీతంగా మధిర ప్రాంతాన్ని అభివృద్ధి చేసుకోవడంలో ఇక్కడి నాయకత్వానికే గుర్తింపు ఉందన్నారు. మున్సిపాలిటీ అభివృద్ధి కోసం గత ముఖ్యమంత్రి కేసీఆర్, కేటీఆర్ ప్రత్యేకంగా నిధులు కేటాయించి అభివృద్ధిలో ముందుంచారన్నారు. అనంతరం మున్సిపల్ చైర్ పర్సన్ మొండితోక లత జయకర్‌తోపాటు వార్డు కౌన్సిలర్లను శాలువాతో ఘనంగా సన్మానించారు. వీరితోపాటు మాజీ ప్రజాప్రతినిధులు, అతిథులను సన్మానించి అభినందించారు. రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ కొండబాల కోటేశ్వరరావు, ఏపీ రాష్ట్రం తిరువూరు మాజీ ఎమ్మెల్యే నల్లగుండ్ల స్వామిదాస్, నందిగామ మాజీ ఎమ్మెల్యే మొండితోక జగన్నాథం, పుంతబాక కృష్ణప్రసాద్, వాసిరెడ్డి రామనాథం, బిక్క కృష్ణప్రసాద్, వల్లబోతుల వెంకటేశ్వర్లు, సూరంశెట్టి కిశోర్, శీలం కవిత, కట్టా గాంధీ, మల్లాది వాసు, అన్నంశెట్టి అప్పారావు, అరిగా రజిని, షేక్ ఇక్బాల్, రావూరి శ్రీనివాసరావు, కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

# ఆయిల్‌పామ్ రైతుల్లో హాఫ్ టైప్ కలవరం

- ఇప్పటికే 1.5 లక్షల మొక్కలు ధ్వంసం
- నర్సరీలో మరో 3 లక్షల పైచిలుకు హాఫ్ టైప్ (నపుంసక) మొక్కలు
- రేగళ్లపాడులో మొక్కలు నాటిన రైతుల్లో తీవ్ర ఆందోళన
- ఏమాత్రం పట్టించుకోని రాష్ట్ర ప్రభుత్వం



రేగళ్లపాడు నర్సరీలో ధ్వంసం చేయకముందు ఎండిపోయిన హాఫ్ టైప్ మొక్కలు(ఫైల్)



రైతుల తోటల్లో హాఫ్ టైప్ మొక్క



రేగళ్లపాడు నర్సరీలో పక్కకు పెట్టిన హాఫ్ టైప్ మొక్కలు

దమ్మపేట రూరల్, జనవరి 25 : కిందిస్థాయి నుంచి పై స్థాయి వరకు వ్యవసాయేతర పట్టభద్రులే పామాయిల్ మొక్కల పెంపకంలో పర్యవేక్షలుగా కొనసాగుతున్నారు. దీంతో ఆయిల్‌పామ్ రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఎనిమిది జిల్లాల్లో తెలంగాణ ఆయిల్‌ఫెడ్‌కు 12 ఆయిల్‌పామ్ మొక్కల నర్సరీలు ఉన్నాయి. ఎనిమిది జిల్లాల్లో ఆయిల్‌పామ్ జోన్ ఉన్న ఆయిల్‌ఫెడ్‌లో ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, జోగులాంబ గద్వాల, మహబూబాబాద్ జిల్లాలకు వ్యవసాయేతర పట్టభద్రులే మేనేజర్లుగా విధులు నిర్వహిస్తున్నారు. వీరి పై అధికారులు సైతం వ్యవసాయేతర పట్టభద్రులే. విదేశాల నుంచి దిగుమతి చేసుకునే మొలకల కార్యకలాపాలను వీరే పర్యవేక్షిస్తున్నారు. హైదరాబాద్‌లోని కేంద్ర కార్యాలయంలో కీలకమైన విధులు నిర్వహిస్తున్న ఆయిల్‌పామ్ ప్లాంటేషన్ డెవలప్‌మెంట్ మేనేజర్ సైతం వ్యవసాయేతర పట్టభద్రురాలు కావడం గమనార్హం.

### రేగళ్లపాడు ఘటన ఓ సంచలనం..

ఖమ్మం జిల్లాలోని రేగళ్లపాడు ఆయిల్‌పామ్ నర్సరీలో ఏకంగా నాలుగు లక్షల ఆఫ్ టైప్(నపుంసక) మొక్కలున్నాయన్న విషయం రాష్ట్రవ్యాప్తంగా సంచలనం రేపింది. తెలంగాణ ఆయిల్‌ఫెడ్ దిగుమతి చేసుకున్న మొలకల్లో 70 నుంచి 80 శాతం మొక్కలు హాఫ్ టైప్‌గా గుర్తించారు. అయితే ఈ విషయం రహస్యంగా ఉంచాలనుకున్నప్పటికీ, ఆయిల్‌ఫెడ్ అధికారుల్లోని అంతర్గత పోరుతో బహిర్గతమైంది. అధికారుల మధ్య అంతర్గపోరు రైతులకు మంచి చేసిందనే చెప్పాలి. యోగాంబా, తంబా రకాల మొక్కల్లో గతంలో దశల వారీగా 70 వేల మొక్కలు, తాజాగా 80 వేల మొక్కలను రేగళ్లపాడు నర్సరీలో ధ్వంసం చేశారు. ఇంకా సుమారు 2.5 లక్షల మొక్కలు జన్యులోపాలతోనూ, కాత కాయని వివిధ రకాల లక్షణాలతో ఉన్న మొక్కలు ఉన్నట్లు గుర్తించి పక్కకు పెట్టారు. ఇప్పటికే హాఫ్ టైప్ మొక్కలు ఇచ్చారని సత్తుపల్లి మండలంలోని నారాయణపురం రైతు సోమిరెడ్డి న్యాయ పోరాటం చేస్తున్నారు. దమ్మపేట మండలంలోని చెలికాని సూర్యారావు, ములకలపల్లి మండలంలోని తాండ్ర దిలీప్‌తోపాటు మరికొందరి తోటల్లో హాఫ్ టైప్ మొక్కలున్నాయని, తోటలను పరిశీలించాలని జిల్లా ఉద్యాన అధికారులకు దరఖాస్తులు చేసుకున్నారు. నారాయణపేట, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో పైలెట్ ప్రాజెక్టుగా సాగు చేస్తున్న రైతులకు సైతం హాఫ్ టైప్ మొక్కలనే ఆయిల్‌ఫెడ్ అధికారులు ఇచ్చారని ఆరోపణలు ఉన్నాయి. రేగళ్లపాడు నర్సరీ ఉదంతంతో తమకు హాఫ్ టైప్ మొక్కలు ఇచ్చారని రైతులు, తెలంగాణ ఆయిల్‌ఫెడ్ అశ్వారావుపేట జోన్ ఆయిల్‌పామ్ గ్రోవర్స్ సొసైటీ గతంలో లేవనెత్తిన ఆరోపణలు నిజమయ్యాయి.

### ఆయిల్‌ఫెడ్‌కు రూ.8 కోట్ల నష్టం!

కోస్టారికా, ఇండోనేషియా, మలేషియాతోపాటు పలు దేశాల నుంచి మొలకలను దిగుమతి చేసుకుని నర్సరీల్లో పెంచి ఒక్కో మొక్కను రూ.200లకు ఆయిల్‌ఫెడ్ విక్రయిస్తోంది. దీనికిగాను రైతుల వాటా పోనూ ప్రభుత్వం రూ.180 రాయితీ డబ్బును ఆయిల్‌ఫెడ్‌కు చెల్లిస్తోంది. దీని ప్రకారం సుమారు 4 లక్షల మొక్కలకు రూ.8 కోట్ల వరకు నష్టం జరిగినట్లు తెలుస్తోంది. మొలకలు సరఫరా చేసిన విదేశీ కంపెనీలతో ఆయిల్‌ఫెడ్ చేసుకున్న ఒప్పంద నిబంధనలన్నీ యాజమాన్యం రహస్యంగా ఉంచుతోంది. హాఫ్ టైప్ మొక్కల స్థానంలో సదరు కంపెనీలు కొత్తగా మొలకలను సరఫరా చేశాయా? లేదా? అన్న విషయం సైతం బయటకు తెలియనియ్యడం లేదు.

### బాధ్యులను వదిలి... చిరుద్యోగులపై ప్రతాపం!

హాఫ్ టైప్ మొలకలను దిగుమతి చేసుకున్న అధికారులు, మొక్కల పెంపకాన్ని పర్యవేక్షిస్తున్న అధికారులను బాధ్యులను చేయకుండా కిందిస్థాయిలో పనిచేస్తున్న చిరుద్యోగులపై ఆయిల్‌ఫెడ్ ఉన్నతాధికారులు తమ ప్రతాపం చూపిస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. మొక్కల పెంపకాన్ని పర్యవేక్షించే నర్సరీ ఇన్‌చార్జి, ప్లాంటేషన్ చేయించే చిరుద్యోగులను బాధ్యులను చేసి సస్పెండ్ చేయడం హాస్యాస్పదమని అంటున్నారు.

### పట్టించుకోని ప్రభుత్వం...

సుమారు నాలుగు లక్షల హాఫ్ టైప్(నపుంసక) మొక్కలు బయటపడినా రాష్ట్ర ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోవడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. రేగళ్లపాడు నర్సరీ నుంచి ఎన్ని హాఫ్ టైప్ మొక్కలు రైతులకు చేరాయో విచారణ జరపాలని ఆయిల్‌పామ్ రైతులు డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయంపై ఖమ్మం జిల్లా ఉద్యాన, పట్టుశాఖాధికారి మధుసూదన్‌ను వివరణ కోరగా.. రైతులు తమ తోటలను పరిశీలించాలని కోరితే సందర్శిస్తామని తెలిపారు. హాఫ్ టైప్ మొక్కలు ఉంటే వాటిస్థానంలో ఉచితంగా ఆయిల్‌ఫెడ్ నుంచి మంచి మొక్కలు ఇప్పిస్తామన్నారు. నష్టపరిహారం విషయంపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని తెలిపారు.

## కేసుల పరిష్కారంలో సహకరించాలి

- హైకోర్టు జడ్జిలు శ్రీసుధ, నగేష్, శరత్



మాట్లాడుతున్న హైకోర్టు జడ్జి శ్రీసుధ

ఖమ్మం లీగల్, జనవరి 25 : కేసుల పరిష్కారంలో న్యాయవాదులు, కక్షిదారులు సహకరించాలని హైకోర్టు జడ్జిలు శ్రీసుధ, భీమపాక నగేష్, కే.శరత్ అన్నారు. శనివారం ఖమ్మం కోర్టు ప్రాంగణంలో రెండవ అదనపు సీనియర్ సివిల్ జడ్జి కోర్టును ప్రారంభించారు. ఖమ్మం పరిపాలనా న్యాయమూర్తి, హైకోర్టు జడ్జి పి.శ్రీసుధతోపాటు హైకోర్టు జడ్జిలు నగేష్, శరత్ ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ న్యాయవాదులు, కక్షిదారులు సహకరిస్తే కేసులు త్వరితగతిన పరిష్కారమయ్యే అవకాశం ఉందన్నారు. ఇప్పుడు కోర్టులు ఏర్పాటు చేసిన వాటికి సంబంధించి ఉద్యోగులను త్వరలో భర్తీ చేస్తామన్నారు. జడ్జిలకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. న్యాయవాదులు, న్యాయశాఖ ఉద్యోగులు శాలువాలతో జడ్జిలను ఘనంగా సన్మానించారు.

## పైలెట్ ప్రాజెక్టు ఎంపిక మార్పు!

- హైడ్రామా నడుమ రెండు గంటల సర్వే తర్వాత మార్పు
- గ్రామస్తుల ఆందోళనతో నిర్ణయం మార్చుకున్న ఉన్నతాధికారులు
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క నియోజకవర్గం కావడంతో చర్చ



ముదిగొండ గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఉన్న అధికారులు

ముదిగొండ, జనవరి 25 : నాలుగు పథకాలకు సంబంధించి లబ్ధిదారుల ఎంపిక అధికారులకు ప్రహసనంగా మారగా.. ఇప్పుడు పైలెట్ ప్రాజెక్టు ఎంపిక కూడా తలనొప్పిగా మారింది. మండలంలోని ఏదైనా ఒక గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి.. జనవరి 26వ తేదీ నుంచి ఆయా పథకాలు ఆ గ్రామంలోనే అమలు చేయాలని ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. అయితే అధికారులు ఖమ్మం జిల్లా ముదిగొండ మండలం బాణాపురం గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్ట్‌గా ఎంపిక చేశారు. లబ్ధిదారుల ఎంపికకు శనివారం రాత్రి 7 గంటల నుంచి సర్వే చేపట్టారు. జాబితా ప్రకారం ఇల్లిల్లూ తిరిగి మీకు ఇల్లు, ఆత్మీయ భరోసా పథకాలు వస్తాయని చెప్పగా ప్రజలు సంబురపడ్డారు. రెండు గంటలపాటు సర్వే తర్వాత మరో గ్రామం ఎంపిక చేశాం.. వెంటనే అక్కడికి వెళ్లి సర్వే మొదలుపెట్టాలని ఉన్నతాధికారుల నుంచి సమాచారం అందింది. దీంతో ఈ విషయం గ్రామస్తులకు తెలియడంతో ఇప్పటివరకూ మా ఊళ్లో సర్వే చేసి.. అన్ని పథకాలు వస్తున్నాయని చెప్పి ఇప్పుడు మరో ఊరు అంటారా? అని సదరు అధికారులతో వాగ్వానికి దిగారు. 'మాకు ఆదేశాలు వచ్చాయి. మేము ఏమీ చేయలేం' అని చెప్పడంతో.. మా గ్రామాన్ని ఎంపిక చేయకుండా బయటకు ఎలా వెళతారో చూస్తాం అంటూ ఆగ్రహంతో గ్రామ పంచాయతీ కార్యాలయం గేటుకు తాళం వేశారు. దీంతో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. 'మాకు పథకాలు ఇవ్వకుండా మిమ్మల్ని ఇక్కడి నుంచి వెళ్లనివ్వం' అంటూ గ్రామస్తులు బైఠాయించారు. మేము చేసేది ఏమీ లేదని చెప్పినా ఎవరూ వినిపించుకోలేదు. చేసేది లేక అధికారులు.. ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. తీవ్ర తర్జనభర్జనల అనంతరం గంట సేపటి తర్వాత మార్పు ఏమీ లేదని, మీ గ్రామాన్నే ఎంపిక చేయాలని ఉన్నతాధికారుల నుంచి సమాచారం రావడంతో గ్రామస్తులు శాంతించారు. ఇది డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క నియోజకవర్గం కావడంతో ప్రజలు పలు రకాలుగా చర్చించుకుంటున్నారు. మొత్తానికి హైడ్రామా నడుమ నాలుగు పథకాలకు లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ ముగిసింది.

## అర్ధరాత్రి అధికారుల సర్వేలు

- నేటినుంచి మరో నాలుగు కొత్త పథకాల అమలు
- పైలెట్ ప్రాజెక్టుగా మండలానికో గ్రామం
- ప్రభుత్వ ఆదేశాల మేరకు అధికారుల ఉరుకులు పరుగులు
- గ్రామాల్లో రాత్రివేళ మరోమారు సర్వేలు
- నేడు లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేత



ఆరెంపుల గ్రామంలో సర్వే చేస్తున్న తహసీల్దార్, ఎంపీడీవో, స్పెషలాఫీసర్ జ్యోతి

ఖమ్మంరూరల్, జనవరి 25 : కాంగ్రెస్ ప్రభుత్వం మరో నాలుగు కొత్త పథకాలు రైతుభరోసా, ఇందిరమ్మ ఇండ్లు, కొత్త రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా అమలు చేసేందుకు సిద్ధమైంది. ఈ మేరకు అధికారులు ఉరుకులు పరుగులు పెడుతున్నారు. పైలట్ ప్రాజెక్టుగా మండలానికో గ్రామాన్ని ఎంపిక చేయడంతో ఆయా గ్రామాల్లో శనివారం అర్ధరాత్రి వరకు మరోమారు సర్వేలు చేశారు. అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేసేందుకు నానా హైరానా పడ్డారు. ఇంటింటికీ తిరిగి క్షుణ్ణంగా పరిశీలన చేశారు. ఆదివారం గణతంత్ర దినోత్సవం సందర్భంగా కొత్త పథకాలను ప్రారంభించి లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందించేందుకు తుది జాబితాను సిద్ధం చేశారు. ఖమ్మంరూరల్ మండలంలోని ఆరెంపుల గ్రామంలో 79 మందిని ఇందిరమ్మ ఇండ్ల పథకానికి, 62 మందిని నూతన రేషన్‌కార్డుల కోసం, 134 మందిని ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకానికి, మరో 614 మందిని రైతు భరోసాకు అర్హులుగా గుర్తించారు. మొత్తం నాలుగు పథకాలకు సంబంధించి 814 మందిని ప్రాథమికంగా అర్హుల జాబితాలో చేర్చారు. వీరితోపాటు గ్రామసభలో కొత్త రేషన్‌కార్డులకు 64మంది, ఇందిరమ్మ ఇండ్లకు 72 దరఖాస్తులను అధికారులను స్వీకరించారు. దీంతో అదనంగా మరో 136 దరఖాస్తులను స్వీకరించినట్లైంది. మొత్తంగా నాలుగు పథకాలకు గాను 950 మంది దరఖాస్తులను స్వీకరించారు. అర్హత కలిగిన వారిలో పాత, కొత్త జాబితాలో ఎంతమంది ఉన్నారు అనేది నిర్ధారణ చేసేందుకు శనివారం రాత్రి ఎంపీడీవో ఎస్.కుమార్, తహసీల్దార్ పీ.రాంప్రసాద్, మండల స్పెషల్ ఆఫీసర్ బీ.జ్యోతి, ఏవో ఉమానగేష్, ఉపాధి హామీ పథకం మండల ఏపీవో శ్రీదేవి పంచాయతీ కార్యదర్శితో కలిసి మరోమారు సర్వే చేశారు. జాబితాలో కొందరు పేర్లకు సంబంధించి నిజానిజాలు క్షేత్రస్థాయిలో తెలుసుకునేందుకు సర్వే చేసినట్లు ఎంపీడీవో తెలిపారు. అర్హత కలిగిన ప్రతి దరఖాస్తుదారుడికి సంక్షేమ పథకాల ఫలాలు అందాలనే ఉద్దేశంతో ప్రభుత్వ ఆదేశాల మేరకు మరోమారు సర్వే చేశామని, ఆదివారం ఉదయం నాటికి పూర్తి జాబితా సిద్ధం చేస్తామని ఆయన పేర్కొన్నారు.

### అనంతారంలో..

జూలూరుపాడు, జనవరి 25 : మండలంలోని అనంతారం గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్ట్‌గా ఎంపిక చేసిన అధికారులు ఆదివారం వైరా ఎమ్మెల్యే చేతుల మీదుగా అర్హులకు మంజూరు పత్రాలను అందించనున్నారు. దీనిలో భాగంగా లబ్ధిదారుల జాబితాను తయారు చేసేందుకు రెవెన్యూ, వ్యవసాయశాఖ, మండల పరిషత్, ఉపాధిహామీ అధికారులు శనివారం రాత్రి వరకు అనంతారం గ్రామంలోని ఇంటింటికీ తిరిగి మళ్లీ సర్వే చేశారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకానికి 18మందిని, ఇందిరమ్మ ఇండ్ల కోసం 75 మందిని అర్హులుగా గుర్తించినట్లు సమాచారం.

## జిల్లా జైలులో న్యాయవిజ్ఞాన సదస్సు




మాట్లాడుతున్న డిఫెన్స్ చీఫ్ న్యాయవాది హనుమంతరావు

ఖమ్మం లీగల్, జనవరి 25 : తెలంగాణ రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ ఆదేశాల మేరకు ఖమ్మం జిల్లా జైలులో ఖైదీల కోసం శనివారం న్యాయవిజ్ఞాన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వరంగల్ రేంజ్ డీఐజీ సంపత్ మాట్లాడుతూ ఏదైనా సమస్యలు ఉంటే వెంటనే తెలపాలని, ఖైదీలందరూ వారికి నచ్చిన రంగంలో ట్రైనింగ్ పొందాలని సూచించారు. ట్రైనీ ఐపీఎస్ రుత్విక్ సాయి మాట్లాడుతూ ఖైదీలు సత్‌ప్రవర్తనతో బయటికి వెళ్లాలని, తిరిగి తప్పులు చేయకూడదన్నారు. లీగల్ ఎయిడ్ డిఫెన్స్ చీఫ్ న్యాయవాది ఎం.హనుమంతరావు మాట్లాడుతూ ఖైదీలందరికీ ఉచిత న్యాయసహాయం అందిస్తున్నామని తెలిపారు. శిక్షపడిన ఖైదీలకు కూడా హైకోర్టులో అప్పీలు చేసుకోవడానికి ఉచిత న్యాయవాదులను నియమిస్తారని, ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ఈ సదస్సులో సీనియర్ న్యాయవాది దేవకి శ్రీనివాసరావుగుప్తా, జైలు సూపరింటెండెంట్ శ్రీధర్ పాల్గొన్నారు.

## ఓటు హక్కు వినియోగించుకోవాలి

### అదనపు కలెక్టర్ డాక్టర్ శ్రీజ



ఓటు హక్కుపై ప్రతిజ్ఞ చేస్తున్న అదనపు కలెక్టర్ శ్రీజ

రఘునాథపాలెం, జనవరి 25 : ఎన్నికల్లో ఓటు హక్కును ప్రతీ ఒక్కరూ వినియోగించుకోవాలని అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ అన్నారు. జాతీయ ఓటర్ల దినోత్సవంలో భాగంగా కలెక్టరేట్ సమావేశంలో మందిరంలో శనివారం జరిగిన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా భారత ఎన్నికల కమిషన్(సీఈవో) అందించిన సందేశాన్ని ప్రొజెక్టర్ ద్వారా ప్రదర్శించారు. ఓటు హక్కు ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం అదనపు కలెక్టర్ మాట్లాడుతూ దేశంలో కుల, మత, ప్రాంత, వర్గ, భాష, పేదరికం, ధనికులు అనే తారతమ్యం లేకుండా అందరికీ సమానంగా ఓటు హక్కు కల్పించినట్లు పేర్కొన్నారు. ప్రతి ఎన్నికల్లో ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో డీఆర్వో ఎం.రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

## కొత్త పథకాల ప్రారంభోత్సవాలకు పకడ్బందీ ఏర్పాట్లు

### వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎస్ శాంతికుమారి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, అధికారులు

రఘునాథపాలెం, జనవరి 25 : రాష్ట్ర ప్రభుత్వ నాలుగు నూతన పథకాల ప్రారంభోత్సవ కార్యక్రమానికి పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి అన్నారు. శనివారం జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆమె సమీక్ష నిర్వహించారు. ఖమ్మం కలెక్టరేట్ నుంచి కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, అదనపు కలెక్టర్ డాక్టర్ పీ శ్రీజ పాల్గొన్నారు. గణతంత్ర దినోత్సవం నుంచి ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతుభరోసా, ఇందిరమ్మ ఇండ్లు, నూతన రేషన్‌కార్డుల జారీ పథకాలను లాంఛనంగా ప్రతి మండంలోని ఒక గ్రామంలో ప్రారంభించేందుకు ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. మధ్యాహ్నం 1గంటకు నాలుగు పథకాలను అధికారికంగా ప్రారంభించాలన్నారు. అర్హులు మాత్రమే జాబితాలో ఉండేలా చూడాలని, కొత్త అప్లికేషన్లను పరిశీలించి అర్హులను ఆ తరువాత జాబితాల్లో చేర్చాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సంబంధిత అధికారులతో మాట్లాడుతూ ప్రతి మండలంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు పథకాలు అమలు తప్పనిసరిగా ప్రారంభంకావాలన్నారు. డీఆర్‌డీవో సన్యాసయ్య, జిల్లా వ్యవసాయశాఖ అధికారి డీ పుల్లయ్య, డీఎస్‌వో చందన్‌కుమార్, డీఎం శ్రీలత పాల్గొన్నారు.





మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ

నమస్తే తెలంగాణ దినపత్రికలో చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు

సెల్ : 9182777073

నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు

సెల్ : 9182777616